ఈనాడు
మెదక్
సోమవారం అక్టోబరు 14, 2024



అమ్మవారిని దర్శించుకుంటున్న పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీపాల్ రెడ్డి, దామోదర రెడ్డి

జనసంద్రంగా దుర్గమ్మ సన్నిధి

పాపన్నపేట: ఏడుపాయల వనదుర్గామాత ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారుజామున అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పలువురు బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్శనానికి గంటల సమయం పట్టింది. వనదుర్గామాతను పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డిలు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణ, నాయకులున్నారు.

తునికిలో విశేష పూజలు

కౌడిపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన కౌడిపల్లి మండలం తునికి నల్లపోచమ్మకు ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాతోపాటు జంటనగరాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఒడి బియ్యంతోపాటు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు సంగారెడ్డి జిల్లా మాజీ అదనపు న్యాయమూర్తి పి.రాజు, నర్సాపూర్ కోర్టు న్యాయమూర్తి అనిత తమ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. పూజారి శివప్ప ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందించారు. ఈవో రంగారావు తదితరులున్నారు.

ధాన్యం సిరులు.. కొనుగోళ్లు షురూ



నేటి నుంచి కేంద్రాల ఏర్పాటు



కోతకు వచ్చిన పంట

న్యూస్‌టుడే-మెదక్:

ధాన్యం కొనుగోలుకు పౌరసరఫరాల సంస్థ సన్నద్ధమైంది. జిల్లాలో సాగైన వరి విస్తీర్ణం, దిగుబడి అంచనాకు అనుగుణంగా ప్రభుత్వ మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక రూపొందించింది. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్ చెల్లించనుండటంతో అందుకు అనుగుణంగా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం నుంచి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ అంశంపై 'న్యూస్‌టుడే' కథనం...

2.97 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో అత్యధికంగా 2.97 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం విపణిలోకి ధాన్యం రానుండటంతో ఇందిరా క్రాంతి పథం(ఐకేపీ), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్), డీసీఎంఎస్, రైతు ఉత్పత్తి సంస్థ(ఎఫ్‌పీవో) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వ్యక్తిగత, మార్కెట్ అవసరాలు పోనూ 4లక్షల టన్నుల ధాన్యం కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మౌలిక వసతులు ఏర్పాటు...

కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, తేమ చూసే, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచుతున్నారు. కోటి గన్నీ సంచులు అవసరమని గుర్తించారు. ప్రస్తుతం 46లక్షల సంచులు అందుబాటులో ఉండగా, మరో 18 లక్షల సంచులు మిల్లుల వద్ద ఉన్నాయి.

లోపాలు అధిగమిస్తేనే...

కొనుగోలు కేంద్రాలు మొదలైన తర్వాతే రైతుల కష్టాలు మొదలవుతాయి. ధాన్యాన్ని ఆరబెట్టే రైతులకు టార్పాలిన్లు పూర్తిస్థాయిలో సరఫరా చేయకపోవడంతో వర్షానికి తడవడం, ఆ తర్వాత తిరిగి వాటిని ఎండబెట్టి, విక్రయించే వరకు పడిగాపులు కాయాల్సి వస్తోంది. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ట్యాబ్‌లో నమోదు చేయడంలో జాప్యం జరగడంతో సకాలంలో నగదు జమకావడం లేదు. ధాన్యం రవాణాలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కేంద్రాలకు లారీలు రాక రోజుల తరబడి అన్నదాతలు కేంద్రాల్లోనే ఉండాల్సి వస్తోంది. 17 శాతం తేమ ఉండాలి. ఇతర నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే కనీస మద్దతు ధర లభిస్తుంది. ఈ అంశంపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి.

టోల్ ఫ్రీ 92811-03685

దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నులలో)
సన్నరకం: 2,30,964
దొడ్డురకం 5,19,000

ఏర్పాటు చేయనున్న కేంద్రాలు
సన్నవి: 93
దొడ్డువి: 390

కొనుగోళ్ల లక్ష్యం (మెట్రిక్ టన్నులు)
సన్న రకం: 1,20,000
దొడ్డు రకం: 2,80,000

అన్ని కేంద్రాలు ఒకేసారి



- హరికృష్ణ, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభించనున్నాం. ఈసారి అన్ని కేంద్రాలు ఒకేసారి ప్రారంభిస్తాం. రైతులకు సమాచారం ఇవ్వాలని ఆయా శాఖల అధికారులకు సూచించాం. ఏమైనా సమస్యలంటే రైతులు టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలి.

జిల్లాలో ఇలా...
వరి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
సన్నరకం: 1,04,970
దొడ్డురకం: 1,92,365

మద్దతు ధర (క్వింటాకు)
ఏ-గ్రేడ్ ధాన్యం: రూ.2,320
సాధారణ: రూ.2,300
సన్నాలకు బోనస్ రూ.500

అవసరాలు
టార్పాలిన్లు: 12,000
ప్యాడీ క్లీనర్లు: 450
డ్రయ్యర్లు: 450
తేమ యంత్రాలు: 650

నరసింహస్వామి సేవలో ఎంపీ



ఆలయ సన్నిధిలో కుటుంబ సమేతంగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

యాదగిరిగుట్ట: మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కుటుంబ సమేతంగా శనివారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి అధికారులు స్వామి దర్శనానికి ఏర్పాట్లు చేశారు.

నేలకూలిన నీలగిరి చెట్లు!

అడవిలో నరికేస్తున్నా పట్టించుకోని అధికారులు



శివ్వంపేట, న్యూస్‌టుడే: అడవిలో అధికారుల పర్యవేక్షణ కరవై చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. నీలగిరి ప్లాంటేషన్‌లో చెట్లు యథేచ్ఛగా నరికేస్తున్నారు. శివ్వంపేట మండలంలో పలుచోట్ల అడవులు ఉన్నాయి. ఇందులో గత కొన్ని సంవత్సరాల నుంచి నీలగిరి ప్లాంటేషన్ చేపట్టారు. అవి ఏపుగా పెరిగి భారీ చెట్లుగా మారాయి. కొన్ని రోజులుగా బీమ్లా తండాలో నీలగిరి చెట్లను నరికేస్తున్నారు. కలప వ్యాపారులు విక్రయం అక్రమ వ్యాపారం చేస్తున్నారు. మంగళపర్తి అటవీ సెక్షన్ రత్నాపూర్ బీట్ పరిధిలో కొందరు అడవిని ఆక్రమించేందుకు చెట్ల నరికివేతకు పాల్పడుతున్నారు. అటవీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అడవులు అంతరిస్తున్నాయి. చెట్ల నరికివేతపై మంగళపర్తి సెక్షన్ అధికారి కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. నిత్యం అటవీ పర్యవేక్షణ చేపడుతున్నామని తెలిపారు. చెట్లు నరికివేసినట్లు తమ దృష్టికి రాలేదన్నారు. విచారించి చర్యలు చేపడతామన్నారు.

ఎస్పీ కార్యాలయంలో ఆయుధ పూజ



ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

మెదక్, న్యూస్‌టుడే: దసరా పండుగ పురస్కరించుకొని శనివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ నిర్వహించారు. ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, అదనపు ఎస్పీ మహేందర్ పోలీసుల ఆయుధాలు, వాహనాలకు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిరంతరం ప్రజాసేవలో జీవించే జిల్లా పోలీసులకు దుర్గాదేవి అనుగ్రహంతో విజయం వరించాలని ఎస్పీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, ఏఆర్ డీఎస్పీ రంగానాయక్, ఆర్ఐ శైలేందర్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఏఆర్ ఎస్సైలు నరేశ్, మహిపాల్ పాల్గొన్నారు.

15న టేబుల్ టెన్నిస్ ఎంపికలు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపికల పోటీలు ఈనెల 15వ తేదీన మెదక్ పట్టణంలోని గుల్షన్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు మెదక్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రభు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో బాల, బాలికలకు ఓపెన్ కేటగిరీలో స్త్రీ, పురుషులకు పోటీలు ఉంటాయి. ఆసక్తి గల వారు ఉదయం 9గంటలలోపు పుట్టిన తేదీ ధ్రువపత్రాలతో పోటీల నిర్వాహకులు రవితేజ, అనిల్‌ను సంప్రదించాలి. మరిన్ని వివరాలకు చరవాణి నం. 9133668875, 9014279221కు సంప్రదించాలని సూచించారు.

ఆరాధనలు చేపట్టి... ఆశీర్వదించి



ప్రార్థన చేస్తున్న ప్రెసిబిటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య, గురువులు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రఖ్యాత మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం క్రీస్తు నామ స్మరణతో మార్మోగింది. గురువులు చర్చిలో శిలువను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రార్థనా మందిరంలో ప్రతిష్ఠించి ఆరాధన చేపట్టారు. ప్రెసిబిటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య, గురువు జైపాల్ దైవ సందేశాన్ని వినిపించారు. ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి భక్తులు, పర్యాటకులు తరలివచ్చి ఏసయ్యను దర్శించుకున్నారు. గురువులు రెవరెండ్ శ్రీనివాస్ ఆశీర్వచనాలు అందించారు. చర్చి ప్రాంగణంలోని శిలువ ముందు భక్తులు కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టారు.

ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలి



మాధవానంద సరస్వతీ స్వామి సమక్షంలో పారాయణం చేస్తున్న బ్రాహ్మణులు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని రంగంపేట పీఠాధీశ్వరుడు శ్రీమాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. ఆదివారం మెదక్ పట్టణంలో బ్రాహ్మణ సంఘం మెదక్ డివిజన్ అధ్యక్షుడు లింగమూర్తి శర్మ, ప్రధాన కార్యదర్శి వైద్య శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంఘ భవన స్థలంలో నిర్మించిన షెడ్డును స్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రాహ్మణులు శ్రీవాండ్ల సాయిబాబా, రాంకోటి పండిట్రావు, శ్రీవాండ్ల కృష్ణమూర్తి, భాష్యం మధుసూదనాచార్యులు, పొద్దరి నరేందర్ బాబు, మిట్టపల్లి ప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



మెదక్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానానికి తరలివచ్చిన ప్రజలు



రావణాసురుడి దహనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు, చిత్రంలో చంద్రపాల్

మిన్నంటిన దసరా సంబరాలు



నర్సాపూర్: పట్టణంలో దుర్గామాత శోభయాత్ర

మెదక్ అర్బన్, మెదక్ టౌన్: ఆకాశంలో బాణసంచా వెలుగులు.. యువతి, యువకుల కేరింతలు.. వేలాది భక్తుల కోలాహలం నడుమ విజయదశమి వేడుకలు శనివారం జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో అంబరాన్నంటాయి. దసరా పండగ పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జమ్మి చెట్టుకు పూజలు చేశారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో రాత్రి ఉత్సవ కమిటీ, పురపాలక సంఘం ఆధ్వర్యంలో వేలాది మంది జనం మధ్య వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ.. చెడుపై మంచి గెలిచిన సందర్భంగా దసరా పండుగను ఏటా నిర్వహించుకుంటామని పేర్కొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన రావణాసుర భారీ ఆకృతిని ఎమ్మెల్యే కాల్చారు. అంతకుముందు పుర అధ్యక్షులు చంద్రపాల్, ఉపాధ్యక్షులు మల్లికార్జున్ గౌడ్‌తో కలిసి దీపపు బెలూన్‌ను గాలిలోకి వదిలి ఉత్సవాలను ప్రారంభించారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు నరేందర్, సారంగాపాణి, శ్యాంరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఫతేనగర్‌లోని బాలాజీ మఠం వద్ద రథోత్సవం నిర్వహించారు. మెదక్‌లోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో జంబి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. నర్సాపూర్‌లో దుర్గామాత శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు.



చాముండేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

చిలప్‌చెడ్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చిట్కుల్ చాముండేశ్వరి మాత ఆలయంలో దసరా సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



ఘనంగా దేవీ నిమజ్జన ఊరేగింపు

శివ్వంపేట మండలంలో దేవీ నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవి నిమజ్జన ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోమారంలో గుడ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవికి ఎమ్మెల్యే సునీతా రెడ్డి పూజలు చేశారు. - న్యూస్‌టుడే, శివ్వంపేట

ఇంకుడు గుంత.. తీరిన నీటి చింత



పాత తహసీల్దారు కార్యాలయం వద్ద ఇంకుడుగుంత

న్యూస్‌టుడే, చేగుంట:

ఇంకుడు గుంతలు నీటి చింతను తీరుస్తున్నాయి. ఒకప్పుడు ఎండిపోయిన బోర్లలో కూడా పుష్కలంగా నీటిని అందిస్తున్నాయి. చాలా మంది ఇంకుడు గుంతలు నిర్మించుకోవటం లేదు. ఒకపక్క ప్రభుత్వం తప్పకుండా ప్రతి ఇంటి ఆవరణలో నిర్మించుకోవాలని సూచిస్తున్నా.. పట్టించుకోవటం లేదు. బోరు బావుల్లో నీటి మట్టం తగ్గిపోతున్న కొద్ది బాధపడుతారే తప్ప వర్షం నీటిని ఒడిసిపట్టే ఇంకుడు గుంతల వల్ల ఉపయోగాలను మాత్రం గుర్తించడం లేదు.

వేసవిలోనూ పుష్కలంగా నీళ్లు..

మండల కేంద్రమైన చేగుంటలో ఇంకుడు గుంతలను వేళ్ల మీద లెక్కించవచ్చు. చేగుంట మాజీ ఏఎంసీ ఛైర్మన్ రజనకు ప్రవీణ్‌కుమార్‌కు బహుళ అంతస్థుల ఇల్లు ఉంది. రెండు బోర్లు ఉన్నా నీరు మాత్రం అవసరం మేరకు రాని పరిస్థితి ఉండేది. సుమారు ఎనిమిదేళ్ల క్రితం ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టారు. వర్షం నీటిని పూర్తిగా దానిలోకి మళ్లించారు. అప్పటి నుంచి నిండు వేసవిలో కూడా బోర్లలో పుష్కలమైన నీరు వస్తోంది. నాడు ఎండిపోయిన బోర్లు నేడు జలధార పోస్తున్నాయి.

ప్రతి ఇంటికి నిర్మాణం

చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌లో ఇంటికో ఇంకుడు గుంత ఉంది. ఏడాది పొడవునా ఆ గ్రామంలో నీటి సమస్య ఉండదు. గతంలో అధికారులు, అప్పటి సర్పంచి నాగభూషణం ప్రజలను చైతన్యం చేశారు. దీంతో ప్రతి ఒక్కరూ నిర్మించుకున్నారు. గ్రామంలో ప్రైవేటు బోర్లు తక్కువగానే ఉన్నాయి. ఇంకుడుగుంతల ప్రయోజనాలను గుర్తించి ఇంటి ఆవరణలో నిర్మించుకుంటే భవిష్యత్తు తరాలవారికి కూడా మేలు జరగనుంది.

తహసీల్దారు కార్యాలయం వద్ద..

చేగుంట పాత తహసీల్దారు కార్యాలయం వద్ద నిర్మించిన ఇంకుడు గుంత సత్ఫలితాలు ఇస్తోంది. కార్యాలయం ముందు బోరు ఉండేది. కానీ దానిలో అవసరం మేరకు నీళ్లు వచ్చేవి కావు. అప్పటి తహసీల్దారు నిర్మల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోరు పక్కనే ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టారు. అందులోకి వర్షం నీటిని మళ్లించారు. ప్రస్తుతం బోరు నుంచి నీరు పుష్కలంగా వస్తోంది. ఈ బోరు నుంచి బీసీ బాలుర వసతిగృహం, ఐకేపీ తదితర కార్యాలయాలకు నీటి సరఫరా చేస్తున్నారు.

పండించిన చేతులతో పంటకు నిప్పు



దోమకాటు సోకడంతో వరి పంటను తగలబెడుతున్న రైతు కొమురయ్య

వరికి దోమకాటు సోకడంతో పండించిన చేతులతోనే పంటకు నిప్పుపెట్టి మిగిలిన కాస్త పంటను దక్కించుకున్నాడు. మండల పరిధి అగ్రహారానికి చెందిన రైతు కొమురయ్య తన ఎకరన్నర పొలంలో వరి పంటను సాగు చేస్తున్నాడు. మరో పది రోజుల్లో పంట చేతికి వస్తుందనుకున్న తరుణంలో దోమకాటు సోకింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పంట మొత్తానికి వ్యాపించకుండా.. దోమకాటు సోకినంత వరకు నిప్పుపెట్టి ఉన్న కాస్త పంటను దక్కించుకునే ప్రయత్నం చేశాడు. –న్యూస్‌టుడే, చిన్నశంకరంపేట

బడి పిల్లలకు రాగి జావ

కార్యక్రమం తిరిగి అమలు



జావ గ్లాసులు చూపుతున్న విద్యార్థులు

న్యూస్‌టుడే-మెదక్, శివ్వంపేట: ఉదయం విద్యార్థుల ఆకలి తీర్చేందుకు, పోషక విలువలతో కూడిన ఆహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాఠశాలల్లో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని గత విద్యా సంవత్సరం ప్రారంభించింది. ఈ విద్యా సంవత్సరం జూన్ వరకు ఈ కార్యక్రమం కొనసాగగా, మూడు నెలలుగా నిలిచిపోయింది. రాగి జావ అందించడం వల్ల మంచి ఫలితాలున్నాయని భావించిన ప్రభుత్వం ఇప్పటికే అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని నిర్ణయించింది. తాజాగా పీఎం పోషణ్ పథకంలో భాగంగా సర్కారు పాఠశాలల్లోనూ తిరిగి ప్రారంభించాలని ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. దీంతో దసరా సెలవుల అనంతరం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జావ అందనుంది.

వారంలో మూడు రోజులు... జిల్లాలో మొత్తం 897 ప్రభుత్వ పాఠశాలలుంటే 1 నుంచి 10వ తరగతి వరకు 64,265 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. వీటితో పాటు ఉదయం వేళ వంట ఏజెన్సీల ద్వారా రాగిజావ కూడా అందించనున్నారు. దీంతో ఉదయం వేళ ఆహారం తీసుకోకుండా వచ్చే విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు ఇలా...

విభాగం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	623	24,869
ప్రాథమికోన్నత	128	9,048
ఉన్నత	146	30,348

కొన్నిచోట్ల అంతరాయం.. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, బెల్లంతో కలిపి మరగబెట్టిన జావను వారంలో మూడు రోజుల పాటు అందించనున్నారు. గతేడాది రాగి జావ పథకం విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందలేదు. శ్రమకు తగిన ఫలితం లేదంటూ వంట ఏజెన్సీలు మొరాయించడం, పిండి, బెల్లం సరఫరా చేయడంలో జాప్యం జరగడంతో కొన్ని చోట్ల తరచూ జావ అందించడంలో అంతరాయం ఏర్పడేది. అలాంటి ఇబ్బందులను అధిగమించి విద్యార్థులకు నిరంతరాయంగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆదేశాల మేరకు..: రాధాకిషన్, జిల్లా విద్యాధికారి

రాగిజావ అందించాలని ఆదేశాలు వచ్చాయి. ప్రభుత్వం నుంచి అవసరమైన పిండి, బెల్లం సరఫరా కాగానే పాఠశాలలకు చేరవేసి, అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం. రాగి జావ విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం. ఫలితంగా వారిలో చురుకుదనం పెరుగుతుంది.


అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

మనోహరాబాద్, న్యూస్‌టుడే: మనోహరాబాద్ ఠాణా పరిధి కోనాయిపల్లికి చెందిన అర్కల బాలేష్(50) శనివారం మద్యం తాగి ఇంట్లో పడుకున్నాడు. ఎంత లేపినా కదలకపోయే సరికి తూప్రాన్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరిశీలించి మృతిచెందినట్లు నిర్ధారించారు. బాలేష్ మరణంపై అనుమానాలు ఉన్నట్లు మృతుడి తమ్ముడు పోచాలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పంచనామా కోసం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్ర క్రికెట్ పోటీలకు నలుగురి ఎంపిక

జిన్నారం: ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు నలుగురు జిన్నారం గిరిజన గురుకులం విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ వెంకట్‌నారాయణ, తెలిపారు. అండర్-14 విభాగంలో డి.కార్తిక్, రవీంద్రనాథ్, ధరావత్ కార్తిక్, రాథోడ్ ధనుష్‌లు ఎంపికయినట్లు పేర్కొన్నారు.

పరిహారం.. ఆశావహం



న్యూస్‌టుడే, తూప్రాన్, నర్సాపూర్, గజ్వేల్: రీజనల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలోని గ్రామాల్లో ఇప్పటికే ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ ప్రక్రియ చేపట్టారు. రైతులకు మెరుగైన నష్టపరిహారం ఇవ్వాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణం అవుతున్న గ్రామాల్లో భూముల విలువను మూడు రెట్లు పెంచింది. కనిష్ఠంగా ఎకరాకు రూ.4.25 లక్షలు ఉన్న విలువను రూ.16.50 లక్షలకు పెంచింది. రూ.7 లక్షలకు పైగా ఉన్న చోట రూ.20 లక్షల వరకు మార్కెట్ విలువను పెంచింది. వాటి వివరాలను ధరణి వెబ్‌సైట్‌లో అధికారులు పొందుపరిచారు. కేంద్ర ప్రభుత్వ అధికారులకు సైతం రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన విలువల నివేదికను అందజేశారు. వారి నుంచి స్పష్టత రాగానే ఎంత చెల్లించాలనే విషయమై కొలిక్కి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

- ట్రిపుల్‌ఆర్ భూనిర్వాసితులకు విలువ పెంచి అందించేందుకు చర్యలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 4,500 ఎకరాల రైతులకు మేలు

110 కిలోమీటర్లు.. 4,500 ఎకరాలు

ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉత్తర భాగంలో సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, జగదేవపూర్ మండలం వరకు 110 కిలో మీటర్ల పరిధిలో 4,500 ఎకరాల భూమి అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. భూముల సర్వేను పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలను సిద్ధం చేశారు. కొన్ని సమస్యాత్మక గ్రామాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు సర్వేలు, రికార్డులను పరిశీలిస్తున్నారు.

కొనసాగుతున్న ఆందోళనలు

ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణం కానున్న పలు గ్రామాల్లో రైతులు భూనిర్వాసితులు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ప్రధానంగా హెచ్‌ఎండీఏ పరిధిలోని నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్ డివిజన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఎకరాకు ఎక్కడా రూ.కోటికి తక్కువ లేదు. కొన్ని చెరువులు, కుంటల సమీపంలోని గ్రామాల్లోనూ ఎకరాకు రూ.40 లక్షలపైన ఉంది. మార్కెట్ విలువల ఆధారంగా తమకు నష్టపరిహారం ఇవ్వాలని ఆందోళనలు చేస్తున్నారు. అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విలువలపై మూడు రెట్లు ఇస్తేనే మార్కెట్ ధర పరిహారం వస్తుందని భూయజమానులు భావిస్తున్నారు.



భూయజమానులతో చర్చిస్తున్న ఆర్డీఓ

ఎవరూ ఆందోళన చెందొద్దు

తూప్రాన్ డివిజన్ పరిధిలో ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణానికి సంబంధించిన నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాం. గతంలో మార్కెట్ విలువను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా పెంచారు. ధరణిలో నమోదై ఉంది. వీలైనంత మేర ఎక్కువ పరిహారం అందించేందుకు చొరవ తీసుకుంటున్నాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

జయచంద్రారెడ్డి, ఆర్డీవో తూప్రాన్

రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి:



రాష్ట్ర ప్రభుత్వం పాంతీయ రింగు రోడ్డు నిర్మాణంలో విలువైన భూములు కోల్పోతున్న విషయాన్ని గుర్తించి మార్కెట్ విలువలను పెంచడం సంతోషకరం. పెంచిన విలువ ఆధారంగానే భూనిర్వాసితులకు తగిన పరిహారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. అప్పుడే న్యాయం జరుగుతుంది. **సత్రు, ఎల్లారెడ్డి గూడెం తండా**

న్యాయం జరిగే వరకు పోరాటం:



ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణంలో విలువైన భూములు కోల్పోతున్నాం. ప్రస్తుతం ఉన్న విలువల ప్రకారం తక్కువ పరిహారం వస్తుంది. మార్కెట్ ధర ప్రకారం ఇవ్వాలి. లేదంటే మాకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తునే ఉంటాం. ఇప్పటికే మా గ్రామంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు భూములు కోల్పోయాం. **యాదయ్య, రెడ్డిపల్లి**

దేశభక్తి గుర్తింపు.. పోటీలతో పెంపొందు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే దేశభక్తిని పెంపొందించడానికి దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల గాథలు తెలియజేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోటీలను నిర్వహిస్తోంది. రక్షణ, విద్యా మంత్రిత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి 'వీర్‌గాథ-4.0' పేరుతో వీటిని చేపట్టింది. ఇప్పటికే దృశ్యశ్రవణ సమావేశం ద్వారా సూచనలు చేశారు. ముందుగా వెబ్‌సైట్‌లో పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులు 150 పదాలకు మించకుండా 'నా రోల్ మోడల్' శీర్షికతో గ్యాలెంట్రీ అవార్డు పొందిన దేశభక్తుడి గురించి వ్యాసం రాయడం లేదా డ్రాయింగ్ వేయాల్సి ఉంటుంది. 6-8వ తరగతి విద్యార్థులు గ్యాలెంట్రీ అవార్డు పొందిన వారి త్యాగం గురించి 300 పదాలకు మించకుండా వ్యాసం లేదా డ్రాయింగ్ లేదా మల్టీ మీడియా ప్రదర్శన ఇవ్వాలి. 9-10వ తరగతి వారు 'రాణీ లక్ష్మీబాయి కలలోకి వస్తే', 'నీవు దేశ సేవ ఎలా చేస్తావు' అనే అంశంతో 750 పదాల వ్యాసం లేదా డ్రాయింగ్, మల్టీమీడియా ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. ఇంటర్ విద్యార్థులు స్వాతంత్ర్య ఉద్యమంలో 1857 తిరుగుబాటులో ప్రేరేపించిన అంశంపై వెయ్యి పదాల్లో వ్యాసం లేదా చిత్రలేఖనం పోటీలు ఉంటాయి.



వీర్‌గాథ-4.0 పేజీ

సూపర్ 100 మంది విజేతలయ్యే తీరు

- జిల్లా స్థాయిలో నలుగురిని ఎంపిక చేస్తారు.
- రాష్ట్ర స్థాయిలో 8 మంది విజేతలు
- జాతీయ స్థాయికి 100 మంది ఎంపికవుతారు.
- 3వ తరగతి నుంచి 5 వరకు.. 6 నుంచి 8 వరకు.. 9, 10 తరగతుల నుంచి.. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల నుంచి 25 మంది చొప్పున మొత్తం 100 మంది ఎంపికవుతారు.
- నగదు బహుమతి రూ.10 వేల చొప్పున ఒక్కొక్కరికి ఇస్తారు.
- పోర్టల్‌లో నమోదుకు గడువు అక్టోబరు 15
- వెబ్‌సైట్ mygov.in పేజీలో 'వీర్‌గాథ' ఆప్షన్ క్లిక్ చేసి వివరాలు నమోదు చేయాలి.
- 17వ తేదీ నుంచి నవంబర్ 10 వరకు జిల్లా స్థాయి, నవంబర్ 12 నుంచి 30 మధ్య రాష్ట్ర స్థాయి, డిసెంబర్ 4-24 మధ్య జాతీయ స్థాయి పోటీలుంటాయి.

సద్వినియోగం చేసుకోవాలి:



జాతీయ స్థాయిలో విద్యార్థుల గుర్తింపు దక్కించుకునేందుకు ఇది చక్కని అవకాశం. పోటీలకు ఎక్కువ దరఖాస్తులు వచ్చేలా కృషి చేస్తున్నాం. సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభం కాగానే అధిక సంఖ్యలో నమోదు జరిగేలా చూస్తాం. **సుదర్శనమూర్తి, జిల్లా సెక్టోరల్ అధికారి, మెదక్**

రైతులకు పంట రుణాలు అందించాలి: సీపీఎం

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: రుణమాఫీ పూర్తయిన రైతులకు తిరిగి వెంటనే రుణాలు అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు డిమాండ్ చేశారు. సిద్దిపేటలో ఆదివారం పార్టీ సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాములు మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు కావొస్తున్నా రుణమాఫీ హామీ పూర్తికాలేదని, మాఫీ అయినా చాలా మందికి రుణాలు ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, సందెబోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వనదుర్గ వర్చస్సు.. భక్తులకు ఉషస్సు



రాజరాజేశ్వరీదేవిగా వనదుర్గ



అమ్మవారి పల్లకీ సేవ

పాపన్నపేట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఏడుపాయల ఆలయంలో విశేష పూజలు, అలంకరణ నిర్వహించారు. దసరా పండుగ సందర్భంగా భక్తుల సందర్శనలతో కిటకిటలాడింది.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. గోకుల్‌షెడ్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయం ముందు ఉన్న నదీపాయ వద్ద మంజీరా మార్జనం కార్యక్రమం నిర్వహించారు. దసరా పండుగ సందర్భంగా వనదుర్గను రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు అమ్మనామస్మరణతో మార్మోగాయి. వాహన పూజలు అధికంగా జరిగాయి.

దేవీ దర్శనం.. మనసు తన్మయత్వం



న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ: ఉత్సవాల చివరి రోజున వర్గల్ విద్యాసరస్వతి అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం తెల్లవారుజామున వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో విశేష పంచామృత అభిషేకం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శమీ పూజ అనంతరం అమ్మవారు సకల జయాలు సిద్ధింప చేసే రాజరాజేశ్వరి మాతగా భక్తులకు దర్శనమివ్వడంతో తన్మయత్వం చెందారు. స్థానిక వెంకటేశ్వర ఆలయంలో శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

త్రిరాత్రోత్సవం సంపూర్ణం



కొమురవెల్లిలో త్రిశూల స్నానం

చేర్యాల, ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో త్రిరాత్రోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. దుర్గాదేవి ఉత్సవాలలో భాగంగా ఆలయంలో ప్రతి ఏటా త్రిరాత్రోత్సవాలలో భాగంగా దుర్గామాతను ప్రతిష్ఠించడం ఆనవాయితీ. ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన దుర్గామాత విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. కోనేరులో అర్చకులు త్రిశూలస్నానం చేశారు. ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, స్థానాచారి పి.మల్లయ్య, ఏఈవో బుద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈశ్వరుడే ఈశ్వరి రూపం



జిన్‌గుర్తిలో..

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే:ఈశ్వరుడు, ఈశ్వరిని వేర్వేరుగా కాకుండా ఒక్కటిగా నిర్వాహకులు అలంకరించారు. భక్తులు దర్శించుకున్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జిన్‌గుర్తి రామలింగేశ్వరస్వామిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు.

అమ్మ రావాలి.. ఆకలి తీర్చాలి

ఏ ప్రాణయినా తన పిల్లల కడుపు నింపేందుకు పోరాటం చేస్తుంది. కొన్ని స్వయంగా ఆహారం అందిస్తుంటే, మరికొన్ని సేకరించి మరీ అందిస్తాయి. మెదక్ జిల్లా తూప్రాన్‌లోని ఓ వెంచర్‌లో చిన్న చెట్టుపై ఓ పక్షి గూడు పెట్టింది. అందులో రెండు పిల్లలు ఉండగా, వాటికి ఆహారం తెచ్చేందుకు తల్లి పక్షి ఎటో వెళ్లింది. ఆ సమయంలో పిల్ల పక్షులు ఆకలేసి అరుస్తుండగా 'న్యూస్‌టుడే' కెమెరా క్లిక్‌మనిపించింది. కాసేపటికి తల్లి పక్షి ఆహారం తీసుకురాగా పిల్లలు అరుపులు మానేశాయి. **న్యూస్‌టుడే, తూప్రాన్**



ఉత్సవాల్లో అపశ్రుతి

విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయిన బాలిక



కీర్తన్య

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. నిమజ్జనానికి దుర్గామాతను ఊరేగిస్తుండగా విద్యుదాఘాతానికి గురై బాలిక శిక కీర్తన్య(8) దుర్మరణం చెందింది. ఈ విషాద ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పోతారం(జె) గ్రామంలో జరిగింది. దసరా పండగ పూట గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాలు గ్రామానికి చెందిన తిరుపతి, మౌనిక దంపతులకు కూతురు కీర్తన్యతో పాటు కుమారుడు ఉన్నారు. వారిది వ్యవసాయ కుటుంబం. గ్రామంలో ఒక దుర్గామాత విగ్రహాన్ని శనివారం రాత్రి ఊరేగించారు. డీజేతో నృత్యాలు చేస్తుండగా చూసేందుకు గ్రామస్థులు తరలివచ్చారు. డీజే పరికరాలకు ఉపయోగించిన తీగ కొంచెం తెగిపోయి నేలపై పడి ఉంది. ఎవరూ గమనించలేదు. ఇంతలో బాలిక కీర్తన్య వచ్చి ఆ తీగపై అడుగేయగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. గమనించిన స్థానికులు వైరును తొలగించారు. బాలికను నంగునూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తర్వాత సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించి మృతి చెందింది. చలాకీగా ఆడుతూ పాడుతూ ఉండే బాలిక మృతి చెందడంతో తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ విజయభాస్కర్, విద్యుత్తు సిబ్బంది సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పండక్కి వస్తూ.. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం



మొగులప్ప

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై బుర్రితండా సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాలు.. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం చింతల్‌దిన్నెకు చెందిన మొగులప్ప(40) హైదరాబాద్‌లో మేస్త్రీ పనులు చేస్తుంటాడు. ఆదివారం పండుగ కోసం బైకుపై స్వగ్రామానికి వెళ్తుండగా.. బుర్రితండా సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. మొగులప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి ఆశప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మొగులప్పకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

మొక్కజొన్న పొలానికి కాపలా వెళ్లిన రైతు..

పెద్దేముల్, న్యూస్‌టుడే: పొలం వద్ద కాపలాకు వెళ్లిన వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పెద్దకురువ బాలప్ప (38) శుక్రవారం రాత్రి తన మొక్కజొన్న పొలానికి వెళ్లాడు. అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో రోడ్డు పక్కన రక్తపు మడుగులో పడి ఉన్నట్లు గ్రామానికి చెందిన వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలప్ప చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్య అంజిలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో గొడవ.. స్నేహితుడి దారుణ హత్య



నదీమ్

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో గొడవ పడిన కొందరు యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుధేర గ్రామానికి చెందిన అక్బర్‌పాషా, షాహిన్‌బేగం దంపతులు 40 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం నగరానికి వలస వచ్చి జగద్గిరిగుట్ట పరిధి దీనబంధు కాలనీలో నివాసముంటున్నారు. కుమారుడు నదీమ్(21). అక్బర్ పాషా మసీదులో పనిచేస్తున్నాడు. తరచూ స్నేహితులతో గొడవపడేవాడు. ఆదివారం రాత్రి తన మిత్రుడి జన్మదిన వేడుకలకు వెళ్లి మద్యం తాగాడు. రోడ్డుపై స్నేహితులతో కలిసి గొడవ పడడంతో పోలీసులు వచ్చి వారికి సర్దిచెప్పి ఇంటికి పంపించారు. అనంతరం కొంతమంది నదీమ్ ఇంటికి వెళ్లి బయటకు పిలిచి గొడవపడ్డారు. ఘర్షణ పెద్దది కావడంతో ఇనుపరాడ్‌తో నదీమ్ తలపై కొట్టడంతో కుప్పకూలాడు. రక్తపు మడుగులో ఉన్న అతడిని పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. సోదరి ఫిర్యాదు మేరకు అనుమానితుడు ఖలీల్‌తోపాటు మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

బలవన్మరణం.. కుటుంబాలు అతలాకుతలం

సమస్యలను అధిగమిస్తూ జీవనాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన వ్యక్తులు కొందరు బాధలను భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆయా కుటుంబాల్లో విషాదం నింపుతున్నారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ముగ్గురు పండుగ రోజుల్లో బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులకు తీరని దుఃఖం మిగిల్చారు.

పెళ్లి కావడం లేదని.. యువకుడి ఆత్మహత్య



అనిల్

మనోహరాబాద్, న్యూస్‌టుడే: పెళ్లి కుదరడం లేదని అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్ జిల్లా కాళ్లకల్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వీరబోయిన భాస్కర్‌కు ఇద్దరు కుమారులున్నారు. చిన్నకుమారుడు అనిల్ (28)కు పెళ్లి సంబంధాలు చూస్తున్నా కుదరటం లేదు. తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. గతంలో ఓ ప్రమాదంలో పైనుంచి కింద పడగా ఒక మూత్రపిండం తొలగించారు. తరచుగా అనారోగ్యానికి గురవుతుండటంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. తల్లిదండ్రులు గమనించి మేడ్చల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

మద్యం తాగొద్దన్నందుకు డ్రైవర్..

రామాయంపేట, న్యూస్‌టుడే: మద్యం తాగడం మానివేయాలని కుటుంబ సభ్యులు సూచించడంతో.. ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సాయిరెడ్డి వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన మారగాని రాజు(32) జీవనోపాధి కోసం గుండ్లపోచంపల్లిలో ఆరు నెలలుగా కుటుంబంతో సహా నివాసం ఉంటున్నాడు. ఆటో నడపడంతో పాటు కూలీ పనులు చేస్తున్నాడు. మద్యం తాగుతుండటంతో ఇంట్లో గొడవలు జరిగేవి. ఈ విషయమై మరోమారు గొడవ జరగడంతో ఆటోలో రామాయంపేట మండలం అక్కన్నపేటకు వచ్చి.. ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నాడు.

అలవాటు మానలేక మెకానిక్ ..

హుస్నాబాద్, న్యూస్‌టుడే: మద్యం తాగడం మానేసేందుకు చికిత్స తీసుకున్నా .. అలవాటు మానక దానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగింది. ఎస్‌ఐ మహేశ్ తెలిపిన వివరాలు.. స్థానికంగా ద్విచక్ర వాహన మెకానిక్ దగ్గర పని చేసిన నమిలికొండ రాజేందర్ (43)కు భార్య రమాదేవి, కుమార్తె ఉన్నారు. గత కొంతకాలంగా రాజేందర్ మద్యానికి బానిసయ్యాడు. చికిత్స కేంద్రం నుంచి తిరిగి వచ్చి మళ్లీ తాగుతున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమై.. విగతజీవిగా మారి..



మోహన్

నర్సాపూర్, న్యూస్‌టుడే: ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తి విగతజీవిగా మారిన ఘటన నర్సాపూర్ పట్టణంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఒంటెద్దు(మందుల) మోహన్(35) ఈనెల 10వ తేదీన పనిపై బయటకు వెళ్లాడు. రాత్రికి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మరుసటి రోజు మోహన్ అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం సాయంత్రం నర్సాపూర్‌లోని పందివాగులో మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం మోహన్‌దిగా గుర్తించారు. అతడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మోహన్ స్థానికంగా ప్లాస్టిక్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.

ప్రదర్శన వైవిధ్యం.. అవగాహన అనునిత్యం

- ఉత్తరాది ప్రజల శైలిపై అధ్యయనంతో విద్యార్థులకు ప్రయోజనం

న్యూస్‌టుడే, హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణం

దేశంలో అన్ని రాష్ట్రాల ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు ఒకే విధంగా ఉండవు. తెలుగు రాష్ట్రాలతో పోల్చితే ఈశాన్య రాష్ట్రాలు, ఉత్తర భారత దేశంలోని రాష్ట్రాల్లోనివి భిన్నంగా ఉంటాయి. వీటన్నింటిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉన్నత విద్యాశాఖ ఇటీవల 'భారతీయ కళా మహోత్సవ్' పేరిట ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించింది. హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయగిరి భిక్షపతి ఆధ్వర్యంలో హైదరాబాద్ బొల్లారం రాష్ట్రపతి నిలయానికి వెళ్లారు. ఈనెల 6 వరకు మొత్తం తొమ్మిది రోజుల పాటు ప్రదర్శనలు నిర్వహించారు. అక్కడి ప్రజల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, పద్ధతులను తెలిపే స్టాళ్లు ఏర్పాటు చేశారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, సిద్దిపేటలోని డిగ్రీ కళాశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు ఈ నెల 5న సందర్శించారు.



ఈశాన్య రాష్ట్ర వాసులతో విద్యార్థులు



అక్కడి ప్రజలు ధరించే టోపీలు

పుస్తకాల్లో చదివినవి ప్రత్యక్షంగా చూశా

– గడిపె సుజిత్, బీకాం ద్వితీయ

ఈ ప్రదర్శన చాలా బాగుంది. వివిధ రాష్ట్రాల్లోని ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం గురించి తెల్సుకున్నా. తెలుగు ప్రజలతో పోల్చితే వారి జీవన విధానం, పద్ధతులు, తీసుకునే ఆహారం తదితర అంశాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. పుస్తకాల్లో చదివిన విషయాలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నా. అవకాశం కల్పించిన ప్రిన్సిపల్‌కు కృతజ్ఞతలు.

నల్లటి బియ్యంతో అన్నం

– చెన్నూరి జ్యోతి, బీజడ్‌సీ ద్వితీయ

రాష్ట్రపతి నిలయంలో వివిధ రాష్ట్రాల గురించి తెల్సుకున్నా. అందులో ఉత్తర భారతంలోని రాష్ట్రాల ప్రజల జీవన విధానం, పద్ధతులు, ఆహారపు అలవాట్లు, కళలు, నృత్యాలు ప్రదర్శించారు. వంట పాత్రలు కలపతో చేసినవి ఉంటాయి. బియ్యంతో చేసిన అన్నం తినడం తక్కువ. నల్లటి బియ్యాన్ని సొంతంగా పండించుకొని వాటినే అన్నం చేసుకొని భోంచేస్తారు. చపాతీల వాడకం ఎక్కువ.

కర్రలు, గడ్డితో ఇళ్లు

– ఎండీ సమీనా, బీఏ ద్వితీయ

ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఇళ్లు, ఉపయోగించే వివిధ రకాల పరికరాలు, దుస్తుల గురించి తెల్సుకున్నా. కర్రలు, గడ్డితో నిర్మించిన ఇళ్లలో అక్కడి ప్రజలు నివసిస్తున్నారు. వారి భాష భలేగా ఉంది. విభిన్న సంస్కృతుల గురించి తెలుసుకోవడం కొత్త అనుభూతి కలిగింది.

ప్లాస్టిక్ గ్లాసులు లేవు

– జక్కు క్రాంతి, బీఎస్సీ తృతీయ

అధ్యాపకుడు చుక్క రమేశ్‌తో కలిసి వెళ్లాం. ఈశాన్య రాష్ట్రాల ప్రజల జీవనశైలి విభిన్నంగా ఉంటుందని తెలుసుకున్నా. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడరు. లోహం, కలప, చెట్టు భాగాలతో చేసినవి వినియోగిస్తారు. నీళ్లను కర్ర పాత్రలో నుంచి తాగుతారు. బంగారం, వెండి ఆభరణాలు వేసుకోవడం తక్కువ. పూసలు, దారాలు, కర్రతో తయారు చేసిన ఆభరణాలు ధరిస్తారు. నృత్యాలు విభిన్నం.

స్నానానికి వెళ్లి.. నీట మునిగి ఇద్దరు మృతి



సంగెం విఠల్

పుల్కల్, బషీరాబాద్, న్యూస్‌టుడే: వేర్వేరు ఘటనల్లో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరు మృతి చెందారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టు వద్ద ఘటన జరిగింది. ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాలు.. సింగూరు గ్రామానికి చెందిన సంగెం విఠల్ (40) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈనెల 11న ప్రాజెక్టు దిగువ భాగాన స్నానం చేయడానికి దిగి మునిగిపోయాడు. ఆ సమయంలో ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి నీటి విడుదల కొనసాగుతుండడంతో పాటు జల విద్యుత్తు కేంద్రం ద్వారా నీరు దిగువకు వెళుతోంది. సమాచారం తెలిసిన వెంటనే అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం విఠల్ ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గేట్ల వద్ద మృతదేహం కనిపించింది. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● వికారాబాద్ జిల్లా బషీరాబాద్ ఎస్‌ఐ గఫార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్డిఘనాపూర్‌కు చెందిన అశోక్ (38) వ్యవసాయ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. దుర్గామాత ఉత్సవాలు ముగిసిన తర్వాత ఆదివారం అక్కడే చెరువులో ఈతకు వెళ్లాడు. ఈదుతుండగా బురదలో ఇరుక్కుపోయి మృతి చెందాడు. అక్కడే ఉన్న కొందరు వెతికి తీసేసరికి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	126-00	డ్రెస్డ్	215-00
రిటైల్	148-00	స్కిన్‌లెస్	244-00

ఆలయ వార్షికోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న చందాయిపేట వాసులు

చేగుంట: చేగుంట మండలం చందాయిపేటలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరిగే వీరహనుమాన్ ఆలయ వార్షికోత్సవానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని ఆహ్వానించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు పబ్బా శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం దుబ్బాక మండలం పోతారానికి వెళ్లి ఎమ్మెల్యేను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపి ఆలయ వార్షికోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. నాయకులు మల్లేశం, నాగరాజు, శోభన్, ప్రదీప్, రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం



ఉద్యోగాలు సాధించిన వారితో ఎంఈవో యాదగిరి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన తన శిష్యులను వెల్దుర్తి ఎంఈవో అరికెల యాదగిరి ఆదివారం వెల్దుర్తిలోని తన ఇంటిలో కుటుంబ సభ్యులతో కలిసి సన్మానించారు. వెల్దుర్తికి చెందిన ముల్కా రవీందర్, కొల్చారం మండలం కొంగోడుకు చెందిన దంపతులు స్వప్న-శేఖర్ యాదగిరి శిష్యులు. యాదగిరి సోదరుడు ఎస్జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. మానేపల్లికి చెందిన రాఘవుల నరేందర్‌రెడ్డి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి తన సోదరులు, యువకులతో కలిసి సన్మానించారు.

రేణుకా ఎల్లమ్మకు పూజలు

చేగుంట: మండలంలోని కర్నాల్‌పల్లి శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చేగుంట, నార్సింగి, మెదక్, తూప్రాన్, మాసాయిపేట, చిన్నశంకరంపేట, రామాయంపేటతో పాటు హైదరాబాద్ నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉచిత నీటిశుద్ధి కేంద్రం ప్రారంభం

శివ్వంపేట: శివ్వంపేట గ్రామం పరిసర ప్రాంత ప్రజల కోసం పులిమామిడి అంజమ్మ-మల్లేశంగుప్తా స్మారకార్థం ఉచిత నీటిశుద్ధి కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పులిమామిడి నవీన్ గుప్తా పండుగ సందర్భంగా ప్రారంభించారు. చలువాది ఆనంద్‌రావు నీటిశుద్ధి కేంద్రం వద్ద ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉచిత మంచినీటిని అందిస్తున్నట్లు నవీన్‌గుప్తా తెలిపారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

వెల్దుర్తి: వెల్దుర్తి ఉమ్మడి మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం నర్సాపూర్ క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డిని కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో రాజిరెడ్డికి, గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్‌పర్సన్ సుహాసినిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. నర్సింహారెడ్డి, సుధాకర్‌గౌడ్, మల్లేశం, కిష్టాగౌడ్, కృష్ణ తదితరులున్నారు.

పింఛన్లకు తప్పని కష్టాలు

లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు బదిలీ ఎప్పుడో



నర్సాపూర్‌లో పింఛన్ల కోసం రోడ్డుపై నిల్చున్న లబ్ధిదారులు

న్యూస్‌టుడే, నర్సాపూర్: పురపాలికల్లో ఆసరా లబ్ధిదారులకు పింఛన్లు బ్యాంకు ద్వారా చెల్లిస్తామన్న హామీ అమలుకు నోచుకోవడం లేదు. బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి ఆరేళ్లు గడుస్తున్నా నేరుగా వారి ఖాతాల్లోకి డబ్బులు జమ కావడం లేదు. ఇప్పటికీ పోస్టాఫీసుల్లోనే పింఛన్లు అందజేస్తుండగా లబ్ధిదారులకు ప్రతినెలా తిప్పలు తప్పడం లేదు. పట్టణంలో పోస్టాఫీసుకు వెళ్లడం అక్కడ ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు పడడం పరిపాటైంది. కొందరి వేలిముద్రలను బయోమెట్రిక్ యంత్రం గుర్తించక పురపాలిక అధికారి వచ్చే వరకు ఆగాల్సివస్తోంది. లబ్ధిదారులకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేయాలని గతంలో అధికారులు అనుకున్నా ఆచరణలో మాత్రం ఆమడ దూరంలో ఉన్నారు.

పింఛన్ల వివరాలు...	
వృద్ధాప్య:	1,471
వితంతు:	1,995
దివ్యాంగులు:	560
గీత కార్మికులు:	115
చేనేత కార్మికులు:	66
బీడీ కార్మికులు:	10
ఒంటరి మహిళలు:	189

ఆరేళ్ల క్రితం ఖాతాలు తెరచి:

నర్సాపూర్ పురపాలిక పరిధిలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికులు ఇలా మొత్తం మూడు వేల మంది లబ్ధిదారుల వరకు ఉన్నారు. ఆరేళ్ల క్రితం పింఛన్లు బ్యాంకు ఖాతాల్లో వేస్తామని అధికారులు ప్రకటించడంతో లబ్ధిదారులు కొందరు వెయ్యి చొప్పున చెల్లించి ఖాతాలు తెరవగా, మరి కొందరు జీరో ఖాతాలు తెరిచారు. ఏటీఎం కార్డులు పొందారు. సుమారు 90 శాతం మంది పురపాలిక కార్యాలయంలో జిరాక్స్ ప్రతులను కూడా సమర్పించారు. కానీ ఇప్పటి వరకు అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేసిన దాఖలాలు లేవు. లావాదేవీలు లేక బ్యాంకర్లు ఖాతాలను నిలిపివేస్తున్నారు.

తొలగిపోనున్న అవస్థలు

తపాలా శాఖ నుంచి ప్రతినెలా పింఛన్లు సకాలంలో అందజేయడం లేదు. వరుసగా మూడు నెలలపాటు పింఛన్ పొందకుంటే రద్దయ్యే అవకాశం ఉంది. ఈ ఇబ్బందులన్నీ తీరాలంటే బ్యాంకు ఖాతాల్లో పింఛన్లు జమ చేయడం ఒక్కటే మార్గం. పింఛన్ల పంపిణీకి ప్రతినెలా తపాలా శాఖ అనేక కారణాలు చూపుతోంది. కార్యాలయం వద్ద రేకుల షెడ్లు లేక వర్షంలో తడుస్తూ, ఎండలో నిల్చోవాల్సి వస్తుంది. కనీసం నీటి వసతి లేదు. ఇటీవల ఎమ్మెల్యే సునీతారెడ్డి, పురపాలిక అధ్యక్షుడు పింఛన్లు పొందే సమయంలో లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులను కళ్లారా చూసి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వార్డు అధికారుల ద్వారా పంపిణీ:

– సునీతారెడ్డి, ఎమ్మెల్యే

పురపాలికలో వార్డుల వారీగా 15వార్డులకు 15 మంది వార్డు అధికారులున్నారు. వీరిచేత పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటాం. ఏ వార్డులో ఉన్న వారికి ఆ వార్డుల్లోనే పింఛన్లు అందేలా చూస్తాం. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. బ్యాంకుల ద్వారా చెల్లింపు అంశాన్ని కూడా పరిశీలిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్	95730 81675	పెద్దశంకరంపేట	80085 73251
నర్సాపూర్	80085 73222	రామాయంపేట	94402 31031
తూప్రాన్	96762 58144		
చేగుంట	80085 73200		(10AM TO 1 PM)


న్యూస్‌టుడే, మెదక్ టౌన్: ? మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు ఎదురుగా వీధి దీపం రెండు రోజులుగా నిరంతరంగా వెలుగుతుంది. – నవీన్‌కుమార్, స్థానికుడు

✔ ఈ విషయం మీ ద్వారా తెలిసింది. క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. – కిరణ్, లైన్‌మెన్ పురపాలిక, మెదక్



పెచ్చులూడి ప్రమాదం.. బాగు చేస్తే నయం

మండల పరిధి బోడగట్టు ప్రాథమిక పాఠశాలలో రెండు గదుల్లో నీటి లీకేజీ కారణంగా గోడల వెంట నీరు కారుతుంది. పైకప్పు పెచ్చులు ఊడిపోయి ప్రమాదకరంగా మారింది. వరండాలో సైతం పైకప్పు పెచ్చులు ఊడిపోయాయి. ఈ ఏడాది ప్రారంభంలో పాఠశాలకు సెలవు రోజున పెచ్చులు కిందపడ్డాయి. ఆ సమయంలో విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రస్తుతం పాఠశాలలో 50 మంది విద్యార్థులు ఉన్నారు. అధికారులు ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టి ప్రమాదం జరగకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, టేక్మాల్



నర్సాపూర్‌లో రావణ దహనం



మనోహరాబాద్ మండలం కూచారంలో..



హవేలిఘనపూర్‌లో..



మానేపల్లిలో..



చిన్నశంకరంపేటలో..

పాలపిట్ట దర్శనం.. రావణ దహనం



రెడ్డిపల్లి పెద్దమ్మ ఆలయంలో జమ్మిచెట్టుకు పూజ చేస్తున్న గ్రామస్థులు



చిలప్‌చెడ్‌లో చాముండేశ్వరాలయంలో వాహనాల పూజలు

దసరా పండుగను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా ఆలయాలు, మండపాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు నూతన వస్త్రాలు ధరించి పాలపిట్ట దర్శనం చేసుకున్నారు. పలువురు ఆయుధ పూజ నిర్వహించారు. సాయంత్రం గ్రామాల శివారుల్లో పాలపిట్టలను చూసి జమ్మిచెట్లకు పూజలు చేపట్టారు. శమీ పూజ నిర్వహించి జమ్మి ఆకులు పంచుకొని శుభాకాంక్షలు చెప్పారు. సాయంత్రం రావణ దహనం చేశారు. ఆయా గ్రామాల్లో జాతీయ జెండాలు కట్టి ఆవిష్కరించారు. నర్సాపూర్, తూప్రాన్, రామాయం పేట, చేగుంట, నార్సింగి, వెల్దుర్తి, మాసాయి పేట, మనోహరాబాద్, పెద్దశంకరం పేట, రేగోడ్, హవేలిఘనపూర్, టేక్మాల్, చిన్న శంకరం పేట, కౌడిపల్లి, చిన్నశంకరం పేట, అల్లాదుర్గం, చిలప్‌చెడ్, పాపన్న పేట, శివ్వం పేటలో రావణ దహనం పోటాపోటీగా నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం



శివ్వంపేటలో మాజీ జడ్పీటీసీ మహేష్‌గుప్తా, గ్రామస్థులు

క్రీడాకారులకు బహుమతుల అందజేత

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: మండల పరిధి కొర్విపల్లి తండాలో సేవాలాల్ యూత్ సభ్యులు మండలస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. 15 జట్లు పాల్గొని తలపడ్డాయి. ఆదివారం ఫైనల్ ఆటలో విజేతగా నిలిచిన దరిపల్లి జట్టుకు రూ.6వేల నగదు, రన్నర్‌గా నిలిచిన గవ్వలపల్లి తండాకు రూ.3వేలు అందించారు. నాయకులు రాజిరెడ్డి, రాజు, పుల్లారావు, లాలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు. కొర్విపల్లిలో వివిధ రకాల క్రీడా పోటీలను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రం నిర్వహించగా విజేతలుగా నిలిచినవారికి బహుమతులను అందించారు.

తుల్జాపూర్‌కు వెళ్లిన భక్తులు

రేగోడ్: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానికంగా ప్రత్యేక పూజలు చేసిన రేగోడ్ భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు మహారాష్ట్రలోని తుల్జాపూర్ తుల్జాభవాని మాతను దర్శించుకునేందుకు ఆదివారం పాదయాత్రగా వెళ్లారు.

బోరు మోటారు వితరణ

శివ్వంపేట, న్యూస్‌టుడే: మండల పరిధి పాంబండలో శివ్వంపేట సహకార సంఘం ఛైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి సొంత నిధులు రూ.40వేలతో బోరు మోటారు ఏర్పాటు చేసి ఆదివారం ప్రారంభించారు. నీటి సమస్య పరిష్కారం కావడంతో దాతను అభినందించారు.

కార్లు ఢీకొని ఏడుగురికి తీవ్రగాయాలు

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొని ఏడుగురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని రెడ్డిపల్లి సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన సిద్ధూ, హరి, ఉదయ్, సాయి, సందీప్ ఏడుపాయల దుర్గామాత ఆలయానికి కారులో వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. మెదక్‌కు చెందిన సమియూల్లాఖాన్, రహమతున్నీసా దంపతులు డ్రైవర్ అయూబ్‌తో కలిసి కారులో హైదరాబాద్ నుంచి మెదక్ వెళుతున్నారు. ఈ క్రమంలో రెడ్డిపల్లి సమీపంలో రెండు కార్లు ఢీకొనడంతో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవరు అయూబ్ సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదంలో రెండు కార్లు నుజ్జు నుజ్జు అయ్యాయి. గాయపడిన కొందరిని 108 వాహనంలో, మరికొందరిని ప్రైవేటు వాహనంలో నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని పలు ప్రయివేటు ఆస్పత్రులకు తరలించారు. ప్రమాదంపై విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సోదరుల మధ్య గొడవ తొమ్మిది మందిపై కేసు

శివ్వంపేట, న్యూస్‌టుడే: దసరా పండుగ రోజు అన్న ఇంటికి తమ్ముడు వెళ్లడంతో జరిగిన గొడవలో ఇరువర్గాలపై కేసు నమోదైంది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నవాబ్‌పేటలో ఏనుగు విఠల్‌రెడ్డి పండుగ సందర్భంగా అన్న రాఘవరెడ్డిని కలిసేందుకు వెళ్లగా ఇరువురి మధ్య భూ వివాదం, పాత గొడవలు ఉండడంతో ఇంటికి ఎందుకు వచ్చావని గొడవ పెట్టుకున్నారు. దీంతో ఇరు కుటుంబాల సభ్యులు రావడంతో ఘర్షణ పడ్డారు. బొల్లారం బుచ్చిరెడ్డి ఆపేందుకు వెళ్లగా అతని తలకు గాయమైంది. ఇరు వర్గాలు ఠాణాలో ఫిర్యాదు చేయడంతో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఆర్థిక సాయం

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: మండల పరిధి ఔరంగాబాద్ తండాలో పదిరోజుల క్రితం కెతవత్ తుక్యా అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న లీలా ఫౌండేషన్ బాధ్యుడు మోహన్‌నాయక్ బాధిత కుటుంబానికి ఆదివారం రూ.5వేలు సాయం అందించారు.



మెదక్ మండలం పెద్దచింతకుంటలో అమ్మవారి ఊరేగింపు..



తూప్రాన్: శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న చిన్నారులు



కాళ్లకల్‌లో అమ్మవారి ఊరేగింపు

గంగమ్మ ఒడికి చేరిన దుర్గమ్మ



వెల్దుర్తిలో దుర్గామాత నిమజ్జనోత్సవ శోభయాత్ర



కొడుపాకలో భూమేశ్‌కు లడ్డూ అందజేస్తున్న నిర్వాహకులు

దసరా నవరాత్రోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా మండపాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాతా విగ్రహాలకు భక్తులు, నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీధుల్లో శోభాయాత్ర నిర్వహించి, భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ, స్థానికులతో కలిసి భవానీ మాలధారులు నృత్యాల చేస్తూ చెరువులు, కుంటల్లో అమ్మవార్లను నిమజ్జనం చేశారు.

కొడుపాకలో చాకలి భూమేష్ రూ. 1,10,010లకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. మెదక్, మనోహరాబాద్, తూప్రాన్, పాపన్నపేట, కొల్చారం, వెల్దుర్తి మండలాల్లో జరిగిన నిమజ్జన ఉత్సవాల్లో ఆయా సంఘాలు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే బృందం



పెద్దశంకరంపేట: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శోభాయాత్ర



కొల్చారంలో యువకుల సందడి..

ప్రమాదకరంగా నియంత్రికలు.. వేలాడుతున్న తీగలు

న్యూస్‌టుడే, టేక్మాల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో విద్యుత్తు సమస్యలు నెలకొన్నాయి. ఎక్కడివి అక్కడ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్తు సరఫరా అంతరాయం, ఇతర సమస్యలతో తీవ్ర అవస్థలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో మండలంలోని పలు చోట్ల ఏర్పడిన ఇబ్బందులను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వ్యవసాయ క్షేత్రాల వద్ద నియంత్రిక

ఆయా చోట్ల పరిస్థితి:

టేక్మాల్ చౌరస్తా ప్రాంతంలోని వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్తు అందించే నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. గద్దె సరిగా లేకపోవడంతో పాటు నియంత్రిక నుంచి స్తంభానికి కనెక్షన్ అందించే తీగలు కిందికి ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. రైతులు రాత్రిళ్లు వెళ్లడానికి భయాందోళనకు గురవుతున్నారు. టేక్మాల్-బొడ్మట్‌పల్లి రోడ్డు చౌరస్తాలో నియంత్రికకు కంచె లేదు. పక్కన వ్యాపార సంస్థలు ఉండడంతో ప్రజలు ఆదమరిస్తే ప్రమాదం పొంచి ఉంది. చల్లపల్లి శివారులో వ్యవసాయ క్షేత్రాలకు స్తంభాల మధ్య దూరం ఎక్కువ ఉండడంతో తీగలు కిందలకు వేలాడుతున్నాయి. టేక్మాల్ శివారు చల్లపల్లి రోడ్డు మార్గంలో సంభం సగానికి విరిగిపోయే స్థాయికి చేరింది. గతంలో ఇనుప పట్టీలు వేసి అమర్చారు. ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి. కొత్త స్తంభం ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు. టేక్మాల్ ఎస్సీ కాలనీలో ఇనుప పట్టీలతో విరిగిపోయిన స్తంభానికి అమర్చారు. నూతన స్తంభం ఏర్పాటు చేసినా ఇంకా కనెక్షన్ అందించలేదు. టేక్మాల్ పెద్దచెరువు, టేక్మాల్ విపణి ప్రాంత శివారులో స్తంభాల మధ్య దూరం ఎక్కువ కావడంతో తీగలు వేలాడుతున్నాయి. వ్యవసాయ పనులు చేసే సమయాల్లో యంత్రాలకు తగిలి ప్రమాదం జరిగే అకాశం ఉంది. హసన్‌మహ్మద్‌పల్లి శివారు, టేక్మాల్ బీటీరోడ్డులో విద్యుత్తు నియంత్రికలకు కంచె లేక ప్రమాదం పొంచి ఉంది. కుసంగి శివారు ఎస్సీ కాలనీ నుంచి వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే తీగలు వేలాడుతున్నాయి. ఇటీవల తెగినా పట్టించుకోలేదు. రెండురోజుల తర్వాత మరమ్మతులులు చేశారు.



టేక్మాల్ ఎస్సీ కాలనీలో ఇలా ఇనుప పట్టీలు..

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా:

–ఉదయ భాస్కర్, ట్రాన్స్‌కో ఏఈ, టేక్మాల్

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న విద్యుత్తు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేశాం. ప్రస్తుతం పంటల సాగు ఉంది. పంటలు పూర్తయిన తర్వాత సమస్యలు పరిష్కరిస్తాం.

భారాస హయాంలో మైనార్టీలకు పెద్దపీట: వంటేరు

గజ్వేల్, న్యూస్‌టుడే: భారాస ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు కేసీఆర్ పెద్దపీట వేశారని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. దసరా పండుగ పురస్కరించుకొని శనివారం సాయంత్రం గజ్వేల్ మండలం బూరుగుపల్లిలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీలకు ప్రత్యేక గౌరవం ఇచ్చారన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి భారాసకు పూర్వవైభవం తీసుకొద్దామన్నారు. నాయకులు ఖాజా విరాసత్ అలీ, గజ్వేల్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ జకియొద్దీన్, పట్టణాధ్యక్షుడు నవాజ్ మీరా తదితరులున్నారు.